మో'డల్' మార్కెట్లు

రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించినా ఫలితం శూన్యం

- ఏళ్ల తరబడి వృథాగా ఉన్నా పట్టించుకునేవారేరీ..?
- వసతులు లేకపోవడంతో అడుగుపెట్టని లబ్ధిదారులు
- అధికారుల అలసత్వం కారణం అంటూ ఆరోపణలు


ఉప్పల్ మండే మార్కెట్ బీరప్పగడ్డలో వృథాగా ఉన్న మోడల్ మార్కెట్

ఉప్పల్: వీధి వ్యాపారులకు ఓ స్థలం కేటాయించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మోడల్ మార్కెట్లు భవనాలు మరుగునపడ్డాయి. ఏళ్ల తరబడి వృథాగా ఉండటంతో అవి కాస్తా కేటాయించకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అన్ని ప్రధాన వ్యాపార కూడళ్లలోనే నిర్మించినా అధికారుల అలసత్వంతో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. మోడల్ మార్కెట్ల నిర్మాణ లోపమే మరుగునపడేందుకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

రూ.కోట్లు ఖర్చు పెట్టినా వృథాగానే..

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఉప్పల్ మండే మార్కెట్, ఉప్పల్ కూరగాయల మార్కెట్, రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ మార్కెట్ మొత్తం మూడు మార్కెట్లను 2016లో ప్రారంభించారు. ఒక్కో మార్కెట్‌కు దాదాపుగా రూ. కోట్టి ఖర్చు చేశారు. ఉప్పల్ బీరప్పగడ్డ మండే మార్కెట్‌లో 15 షాపులు ఉండగా 13 షాపులను కేటాయించారు. వెంకటరెడ్డినగర్‌లో 15 షాపుల్లో 13 షాపులను కేటాయించారు. ఉప్పల్ గాంధీనగర్ కూరగాయల మార్కెట్‌లో 19 షాపులకుగాను 9 షాపులను కేటాయించారు.

సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం

ఉప్పల్ సర్కిల్ పరిధిలో 49 షాపులను నిర్మించినా సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో విద్యుత్, తాగునీరు, బాత్‌రూంలు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో షాపులను వేలం పాటలో దక్కించుకున్నా మౌలిక వసతులు లేకపోవడంతో ఇప్పటి వరకు ఎవరూ అడుగు పెట్టకపోవడం గమనార్హం.

మౌలిక వసతులు శూన్యం

షాపు అలాట్ అయ్యింది. కానీ అక్కడ ఎలాంటి వసతులు లేవు. కనీసం బాత్‌రూంలు, నీటి వసతి లేదు. వాచ్‌మెన్ లేడు. డ్రైనేజీ వసతి కూడా లేదు. ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్త కనిపిస్తోంది. షాపులు పెట్టుకున్నవాళ్లు వ్యాపారం నడవక వదిలేసి వెళ్లారు.

– పండ్ల కిషన్, లబ్ధిదారుడు

త్వరలో సదుపాయాలు కల్పిస్తాం

వేలంపాటలో దక్కించుకున్న వారు వెంటనే షాపుల్లో చేరాలి. వారు చేరిన వెంటనే అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇప్పటికే తాగునీటి సదుపాయం కల్పించాం. ఇంకా ఏమైనా సదుపాయాలు కావాలన్నా త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

– ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్

సమృద్ధిగా పోస్టల్ సేవలు


ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు

ఉప్పల్: విస్తృతంగా లభిస్తున్న పోస్టల్ సేవలను పౌరులంతా వినియోగించుకోవాలని పోస్టల్ అధికారి జి.హైమావతి సూచించారు. ఈ మేరకు ఉప్పల్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుకన్య సమృద్ధి అకౌంట్స్, పొదుపు ఖాతాలు, సీనియర్ సిటిజన్ స్కీమ్స్, ఆధార్ సేవలు, తపాలా జీవిత బీమా వంటి అనేక సౌకర్యాలు ఉప్పల్ పోస్టల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. వీటితో పాటు 300 నుంచి 500 వరకు వినియోగదారులు కోరితే వారి వద్దకే పోస్టల్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇంకా ఎలాంటి వివరాలు కావాలన్నా ఉప్పల్ పోస్ట్‌మాస్టర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఖాతాదారులు, పోస్ట్‌మాస్టర్ సంతోష్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

మల్లాపూర్: నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన నాయీ బ్రాహ్మణ కమిటీ ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి వెళ్లి బండారి లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీరస్వామి, అశోక్, వెంకటరమణ, సత్తయ్య, పరుశురాం తదితరులు ఉన్నారు.

మారుతి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం



కుషాయిగూడ: అమావాస్య సందర్భంగా కుషాయిగూడ మారుతీ మిత్ర మండలి ఆధ్వర్యంలో మంగళవారం కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. తమవంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్, మిత్రమండలి ప్రతినిధులు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, అశోక్‌చారి, బాబు, వెంకట్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్‌యాదవ్, చక్రపాణిగౌడ్, జనార్దన్, గోపాల్‌చారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి


మాట్లాడుతున్న నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్

నవ సంఘర్షణ సమితి

ఉప్పల్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్ డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా బీసీలకు రాజ్యాధికారం 60 శాతం రిజర్వేషన్ల ధ్యేయంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దేశంలో అన్ని బీసీ కులాలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్‌తో ఫిబ్రవరి నెలలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసా వెంకటేష్ గౌడ్, నేర్దం భాస్కర్‌గౌడ్, సిద్దేశ్వర్, పండ్యాల మధుసూదన్, సర్దార్ సర్వాయిపాపన్న సేన రాష్ట్ర అధ్యక్షుడు పంజాల శ్రవణ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు సామాజిక సేవలో పాల్గొనాలి


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ తదితరులు

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: సాయిక్రిష్ణనగర్‌లో మంగళవారం వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల సంఘాలు తమ సామాజికవర్గం అభివృద్ధితో పాటు ఇతర సామాజిక సేవలో కూడా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అందరికీ అందేవిధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిటికెల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పాయసం గోపాల్, ఉపాధ్యక్షులు బాలస్వామి, తిరుపతయ్య, వెంకటయ్య, చిన్న కృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వద్ద అలైన్‌మెంట్ పాయింట్స్ ఫిక్స్ చేయాలి


పెద్ద చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, కాలనీవాసులు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ విభాగం అధికారులు, తహసీల్దార్ నర్సింహారెడ్డి మంగళవారం చెరువు వద్ద ఆలైనింగ్ పాయింట్స్ ఫిక్స్ చేసేందుకు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన కాలనీవాసులతో కలిసి చెరువు వద్దకు చేరుకొని ఆలైనింగ్ పాయింట్స్ విషయంపై ఆరా తీశారు. 2023 సర్వే ప్రకారం ఎఫ్‌టీఎల్ అలైన్‌మెంట్ పాయింట్స్ ఫిక్స్ చేస్తామని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఈ పృథ్వీ, సాయిచిత్రనగర్, రవీంద్రనగర్, లక్ష్మీనగర్, మహేష్‌నగర్ కాలనీవాసులు, సీనియర్ సిటీజన్లు తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ షాపు ఎత్తివేయాలంటూ ఆందోళన


చక్రిపురంలోని శివలలిత వైన్స్‌షాపు ఎదుట ఆందోళన

కుషాయిగూడ: ఇబ్బందికరంగా మారిన వైన్స్‌షాపును ఎత్తేయాలంటూ మహిళలు రోడ్డెక్కారు. చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తా సమీపంలోని శివలలిత సాయి వైన్స్ వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామంటూ మహిళలు వైన్స్ షాపు ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. సాయంత్రం 6 దాటితే గేటు దాటి బయటకు రాలేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు వాహనాలను పార్కు చేసి రాత్రి పొద్దుపోయే వరకు మద్యం తాగుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. ఈసీఐఎల్–నాగారం ప్రధాన రోడ్డుపై సైతం ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఇలాంటి పరిస్థితులతో సతమతం అవుతుంటే మరోపక్క ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిట్‌రూం నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. అక్రమంగా నిర్మాణం జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. అన్ని విభాగాల అధికారులు స్పందించి వైన్స్ షాపును కాలనీ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. షాపు తరలించే వరకు ఆందోళన ఆపేది లేదని స్పష్టం చేశారు. వారికి సినీనటుడు సూర్యకుమార్ మద్దతుగా నిలిచారు.

మహిళలపై హింసను అరికట్టాలి

శామీర్‌పేట్: మహిళలపై హింసను అరికట్టాలని మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త ప్రియాంక ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామంలోని బాలికల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలిపారు. బాల కార్మిక, పోక్సో, చైల్డ్ లైన్ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల సంరక్షణ హెల్ప్‌లైన్ నంబర్– 100, 181, 1098, 14567.

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతా..


రాజీవ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నానని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు


మల్కాజిగిరి జైన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం

అల్వాల్: అమావాస్యను పురస్కరించుకొని గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌతంనగర్ దుర్గా భవానీ ఆలయం, మధుసూదన్‌నగర్‌లోని జైన్ మందిరం వద్ద మల్కాజిగిరి జైన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

సామాజిక సేవా అవార్డు



రామంతాపూర్: టీవీ కాలనీకి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు వనిత జీవన సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఆకుల సుభాషిణికి సామాజిక సేవ విభాగంలో అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం మక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, మాజీ స్పీకర్ మధుసూదనచారి చేతుల మీదుగా ఆమెకు అవార్డు అందించి ఘనంగా సన్మానించారు.

పరామర్శ


సంతాపం తెలియజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ నేత గడ్డం రవికుమార్ సతీమణి అంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని లక్ష్మీ ప్రసన్న(45) కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం స్థానిక శ్రీరామపురంలోని వారి గృహంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో పాటు సీనియర్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, సర్వబాబు యాదవ్, పాలపూరి శ్రీకాంత్‌గౌడ్, గిరిబాబు, వెంకటేశ్వరరెడ్డి, రఫీక్, గోపాల్‌రెడ్డి ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గడ్డం రవికుమార్‌ని పరామర్శించారు.

ఎమ్మెల్యేకు అభినందనలు


బీఎల్ఆర్‌ను అభినందిస్తున్న చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఎమ్మెల్యేగా గెలిపించడంలో నా పట్ల మీరు చూపిన ఆదరణ మరులేనిదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో పాటు పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, ఉద్యమ నేతలంతా బీఎల్ఆర్‌ను మంగళవారం కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ ప్రజలు నాకు భారీ మెజార్టీని అందజేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. ఎలాంటి సమస్యలున్నా తనను నేరుగా కలిసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, నర్సింహ వంశరాజ్ పాల్గొన్నారు.

నాచారం ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


బండారి లక్ష్మారెడ్డికి ఫొటో అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం చేసిన సందర్భంగా మంగళవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ బండారి లక్ష్మారెడ్డిని సత్కరించారు. అనంతరం అసెంబ్లీలో ప్రమాణం చేసిన ఫొటో ప్రతిమను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో సాయికుమార్, సాయివేవ్ సాహితీ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు అభినందనలు


మంత్రి సీతక్కకు అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కుషాయిగూడ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి సీతక్కను మంగళవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్, పోలేపాక అంజయ్య, పోలగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్, మల్లేష్, అహ్మద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కొనిగూడ, చందుపట్లగూడకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆర్టీసీ డిపో అధికారులకు మంగళవారం వినతి అందజేశారు. ఉప్పల్, చెంగిచెర్ల డిపోల నుంచి రెండేసి బస్సులు నడపాల్సిందిగా కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, చెంగిచెర్ల డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్‌ను లేఖలో కోరారు. అలాగే ఎదులాబాద్ వెళ్లే బస్సులు చందుపట్లగూడకు గ్రామంలో నుంచి వెళ్లాలని కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే..

రెవెన్యూ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు తప్పకుండా తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నికాల సహకారం అధికార యంత్రాంగం నుంచి ఉంటుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్లు తమ విధులను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి తహసీల్దార్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లయితే.. వెంటనే నోటీసులు జారీ చేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయనే వివరాలను తెలుసుకుని, వాటిని ఎవరైనా కబ్జా చేసినట్లయితే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలోని ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డు ఏర్పాటు చేయటంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని తహసీల్దార్లకు ఆయన సూచించారు.

సమగ్ర సమాచారంతో..

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఆక్రమణదారులు ఇబ్బందులకు గురిస్తే చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ అధికారులతో 15 రోజులకోసారి అన్ని విషయాలపై సమీక్ష సమావేశాలు ఉంటాయని, ప్రభుత్వ భూములపై సమగ్ర సమాచారంతో ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్లు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులకు అన్ని విషయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ తమ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌లో సత్తాచాటిన లయోల విద్యార్థులు


టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చిన లయోలా విద్యార్థులు

అల్వాల్: గోల్కొండలోని ఆర్టీ సెంటర్ స్టేడియంలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన టోర్నమెంట్‌లో లయోలా అకాడమీ విద్యార్థులు చురుగ్గా పాల్గొని అనేక పతకాలు, ట్రోఫీలను గెలుచుకున్నారు. అకాడమీ అథ్లెట్‌లను ప్రిన్సిపాల్ ఫాదర్ ఎల్.జోజిరెడ్డి ఎస్‌జే, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ఎ ఎమ్ జోసెఫ్‌కుమార్ ప్రసంశలు తెలిపారు. రాబోయే టోర్నమెంట్స్‌కి మంచి ఫిట్నెస్‌తో సత్తా చాటాలని ఆయన అన్నారు.

శానిటేషన్ సిబ్బందికి సహకరించాలి


శానిటేషన్ కిట్స్ అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: నిత్యం ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చుకుంటూ విధులు నిర్వర్తించే శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. జీహెచ్ఎంసీ అందజేసిన శానిటేషన్ కిట్స్‌ను మంగళవారం ఆమె సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో వందశాతం స్వచ్ఛత సాధించే దిశగా పనిచేయాలన్నారు. సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ సహకారం అందజేయాలన్నారు. శానిటేషన్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: తడి పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరుచేసి చెత్తను సేకరించే వాహనంలో వేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని డ్వాక్రా భవనంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఘన పదార్థాల నిర్వాహణ, సామాజిక మరుగుదొడ్ల నిర్వాహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, తడి పొడి చెత్త వినియోగంపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ రుమాదేవి, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు సాయినివాస్ కాలనీలో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ గూడురు సబితఆంజనేయులుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు జావిద్, మహేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

శామీర్‌పేట్: అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శామీర్‌పేట రేంజ్ ఆఫీసర్ విజయభాస్కర్ అన్నారు. ఎండీ తహరుద్దీన్ ఖాదిల్ అనే వ్యక్తి మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని పూరిగుట్ట సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 120లో జేసీబీ సాయంతో భూమిని చదును చేస్తున్నాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జేసీబీతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరిపిన అధికారులు రూ.50 వేల జరిమానాతో పాటు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూటికి నూరు శాతం ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి పన్నుల వసూళ్లపై బిల్‌కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో బిల్ కలెక్టర్లు తమకు కేటాయించిన వార్డుల్లో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలంతా సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో శానిటేషన్ పనుల వివరాలను సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్‌కలెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.